www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 సెప్టెంబర్ 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



## ప్రయివేట్ పరం చేయడం దుర్మార్గం

**ప్రజాశక్తి - ముమ్మిడివరం**

మెడికల్ విద్యను ప్రయివేటుపరం చేయడం దుర్మార్గమని బహుజన సమాజ్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక పోలమ్మ చెరువు గట్టుపై ఉన్న బుద్ధ పార్కు ఆవరణలో బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షుడు బడుగు భీమేశ్వరరావు అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ వాకపల్లి భీమారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయడాన్ని ఖండించారు. ఈ విధానం అమలుతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు వైద్య విద్యకు దూరం అవుతారని అన్నారు. ప్రయివేట్ వ్యక్తులకు లాభం చేకూర్చే ఈ పిపిపి విధానంలో సామాజిక న్యాయం అందని ద్రాక్షగా మిగులుతుందన్నారు. తక్షణమే ఈ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిడి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, పందిరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# వారలో ఇమడని జనసైన్యం

- ఎంఎల్‌ఎపై ముప్పేట విమర్శల దాడి
- సొంత పార్టీ జనసేనలోనూ అదే స్వరం
- ఎస్‌సి సామాజికవర్గం సైతం వ్యతిరేకత



ప్రోటోకాల్ పాటించకుండా జనసేన నాయకులతో కార్యక్రమంలో ఎంఎల్‌ఎ (ఫైల్ ఫోటో )

**ప్రజాశక్తి - సఖినేటిపల్లి**

రాజోలు నియోజకవర్గం సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతం. అనునిత్యం రాజకీయ వేడితో రగిలే రాజోలు ఇటీవల కొద్దిపాటిగా చల్లబడినట్లు కనిపించినా తిరిగి ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ కేంద్రంగా రాజకీయ రగడ ప్రారంభమైంది. ఒక పక్క సొంత పార్టీ జనసేన నుంచి యెనుమల వెంకటపతి రాజా, మరోపక్క రాజోలు ఎంపి స్థానం రగడతో టిడిపి శ్రేణులు, ఎస్‌సి సామాజికవర్గం సైతం ఎంఎల్‌ఎపై ఫైర్ అవుతుంది. జనసైనికులకు అండగా జనసేన పార్టీ నిలబడటంలో విఫలం చెందుతున్నారని వెంకటపతి రాజా సోషల్ మీడియా వేదికగా విమర్శల వర్షం కురిపించారు. ఆయన లండన్ నుంచి నియోజక వర్గానికి వచ్చిన తర్వాత ఎంఎల్‌ఎతో సయోధ్య కుదిరింది. ఆయన ఎన్‌జిటి నిధులతో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకొన్నారు. మళ్ళీ సమస్య మొదటికి వచ్చి సోషల్ మీడియా వేదికగా తిరుగుబాటు జెండా ఎగురవేసేందుకు సిద్ధపడుతున్నట్లు ఆయన పోస్టులు తేటతెల్లం చేస్తున్నాయి.

రాజోలు టిడిపి నుంచి ఎంపిపిగా కేతా శ్రీను గతంలో గెలుపొందారు. అయితే సుమారు 3 నెలల క్రితం ఆయన అకస్మాత్తుగా మృతి చెందారు. దీంతో ఎంపిపి పదవికి ఇన్‌ఛార్జ్‌ను నియమించాల్సివుంది. అయితే టిడిపి, జనసేన పార్టీలకు చెందిన వైస్ ఎంపిపిలు ఎంఎల్‌ఎపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో ఆయన ఈ అంశానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఇరుపార్టీలకు చెందిన నేతలు ఆయనపై అసంతృప్తికి లోనయ్యారు. ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన వైస్ ఎంపిపికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదంటూ ఆ సామాజికవర్గం ఆయనపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది.

రాజోలు నియోజకవర్గంలో ఎస్‌సిల పరిస్థితి రాజకీయంగా దీనస్థితిలో ఉందని దళిత సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎస్‌సి రిజర్వుడు స్థానం ఐనప్పటికీ నియోజకవర్గంలో ప్రశ్నించే నాయకులపై కేసులు పెట్టించే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల రాజోలు ఎంపిపి ఎన్నికకు ముందు ఇన్‌ఛార్జ్ ఎంపిపిని నిబంధనల ప్రకారం ఎన్నుకోవాలంటూ దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ బహిరంగంగానే డిమాండ్ చేశారు. ఆ ప్రక్రియలో దళిత నాయకుల కేంద్రంగా ఎంపిపి ఎన్నికకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారని ఎస్‌సి నాయకులు వాపోతున్నారు. ఇటీవల పిఎసిఎస్ నామినేటెడ్ పోస్టుల్లో సైతం ఎస్‌సిలకు ప్రాధాన్యత లేకపోవడాన్ని మాజీ సర్పంచ్, దళిత నాయకుడు సరెళ్ళ విజయ్‌ప్రసాద్ సైతం ఆరోపించారు. వైసిపి పాలనలో కాపు సామాజిక వర్గానికి ప్రాధాన్యతనిస్తూ నాటి ఇన్‌ఛార్జ్ బొంతు రాజేశ్వరరావు ఏడుగురికి ప్రాధాన్యతనిస్తూ, ఇద్దరు ఎస్‌సిలను పిఎసిఎస్ అధ్యక్షులుగా ఎంపిక చేశారని, టిడిపి పాలనలో దళిత నాయకులు ఉన్నా వారిలో ఎవరికీ ప్రాధాన్యత లేకుండా పోతుందనే ఆవేదన ఎస్‌సి సామాజికవర్గం నుంచి వినిపిస్తోంది. ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ సొంత పార్టీలో ఉన్న ఎస్‌సి నాయకులను సైతం పట్టించుకోవడం లేదని జనసేన నాయకుడు డాక్టర్ రాపాక రమేష్‌బాబు, నాయకులు గెడ్డం మహాలక్ష్మీప్రసాద్ విమర్శలు గుప్పిస్తున్నారు.

నియోజకవర్గంలో సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు మూడు మండలాల్లో ముగ్గురు ఎస్‌సి మహిళలు జడ్‌పిటిసిలుగా వైసిపి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సఖినేటిపల్లి ఎంపిపిగా వీరా మల్లిబాబు సైతం వైసిపికి చెందిన వారే. వీరికి ఎవరికి ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యక్రమంలో ప్రాధాన్యతనివ్వడం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన మహిళా జడ్‌పిటిసిలకు కూడా ప్రాధాన్యత ఇవ్వకపోవడం వెనుక ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. అధికారిక కార్యక్రమాలలో ఏ విధమైన ప్రోటోకాల్ లేని జనసేన గ్రామస్థాయి నాయకులు ముందు వరసలో కూర్చుంటే జడ్‌పిటిసిలు, ఎంపిపిలు అధికారుల వెనుక సీట్లలో కూర్చోబెడ్డటంపై కలెక్టర్‌గా చేసి వచ్చిన ఎంఎల్‌ఎకు ప్రోటోకాల్ తెలియదా? అనే ప్రశ్నలు ఎస్‌సి సామాజికవర్గం నుంచి వినిపిస్తున్నాయి. ఎస్‌సిల పట్ల జరుగుతున్న నిర్లక్ష్యంపై జనసేన, టిడిపి, వైసిపిలోని దళితులంతా ఏకమై ఉద్యమించేందుకు కార్యచరణ చేస్తున్నట్లు ఎస్‌సి సంఘాలు నాయకులు తెలుపుతున్నారు.

### ఎస్‌సిల పట్ల నిర్లక్ష్యం



పిఎసిఎస్ త్రిసభ్య కమిటీలో ఎస్‌సిలకు ఒక్కరికి అవకాశం కల్పించలేదు. కనీసం ఒక డైరెక్టర్‌గా కూడా ఎంపిక చేయలేదు. ఇది దారుణం. ముందు పనిచేసిన గొల్లపల్లి, రాపాకలు ఎస్‌సి నాయకులకు ప్రాధాన్యనిచ్చేవారు. సామాజికవర్గాల కూర్పు చేసేవారు. ప్రస్తుత ఎంఎల్‌ఎ ఎస్‌సిలకు ఏవిధమైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణం. ప్రశ్నిచే వారిని పోలీసులతో బెదిరింపులకు పాల్పడటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం.

-సరెళ్ళ విజయ ప్రసాద్, మాజీ సర్పంచ్

### ప్రశ్నించే వారిపై కేసులు



ఎస్‌సిలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టించడం సరికాదు. ఎస్‌సి రిజర్వేషన్లతో ఉద్యోగం, ఎంఎల్‌ఎగా ఎన్నికైన ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ రాజ్యాంగబద్ధంగా ఎస్‌సిలకు రావాల్సిన పదవులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నో ఏళ్ళుగా రాజకీయాల్లో ఉంటున్నా దళితులను అధికారం చేతికి వచ్చిన తదుపరి నిర్లక్ష్యం చేస్తున్నారు.

-బత్తుల మురళీ కృష్ణ, దళిత చైతన్య వేదిక, రాజోలు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

## ఉపాధి కల్పించాలంటూ ఆటో డ్రైవర్ల ధర్నా

**ప్రజాశక్తి - అమలాపురం**

ఎపి ఆటో, క్యాబ్, టాటా ఎసి, ట్రాన్స్‌పోర్ట్ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, వైఎస్‌ఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యల్లమల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఆటోల ద్వారా ఉపాధి పొందుతును న్నారని అన్నారు. ఆ కార్మికులకు ప్రభుత్వం ఉపాధి లేకుండా చేసిందని మండిపడ్డారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి లేక నిరుద్యోగ యువకులు ఆటో డ్రైవర్‌గా మారుతున్నారని అన్నారు. బ్యాంకుల ద్వారా రుణం ఇవ్వకపోవడంతో ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని ఆటోల ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం రవాణ రంగాన్ని మొత్తం ప్రయివేటుకరణ చేయాలన్నా ఆలోచనతో ఇప్పటికే డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేసే ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేసి రవాణా కార్యాలయాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఉన్నదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల మల్లిబాబు, బొంతు శ్రీనివాస రావు, యల్లమల్లి చంటి, గుత్తుల సుబ్రహ్మణ్యం, మద్దా సత్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌ను ప్రారంభించిన మంత్రి సుభాష్

**ప్రజాశక్తి - రామచంద్రపురం**



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కొరకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని లైఫ్ సపోర్ట్ కోసం రూ.40 లక్షలతో అంబులెన్స్ 108 ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి కేటాయించిన అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ 108 అంబులెన్స్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా రూ.25 లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ వాహనంలో అడ్వాన్సడ్ లైఫ్ సపోర్ట్‌తో ఒకేసారి ముగ్గురు రోగులను తరలించేందుకు వీలు ఉంద న్నారు. ఈ వాహనంలో 28 రకాల అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. త్వరలో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో కిడ్నీ బాధితుల నిమిత్తం డయాలసిస్ యూనిట్, ఫిజియో థెరపీ యూనిట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వార్డులను సందర్శించి రోగుల ఆరోగ్య స్థితిగతులు, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి అవినాష్, ఎఎంసి ఛైర్‌పర్సన్ అక్కల రిషితరాయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ రణభేరి

**ప్రజాశక్తి - మామిడికుదురు**



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యారంగ ఆర్థిక సమస్యలపై ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సి.హెచ్.కేశవరావు తెలిపారు. సోమవారం రణభేరి పోస్టర్‌ను స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా విద్యారంగంలో నెలకొన్న ఒక్క సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడంతో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించేందుకు సమయం సరిపోవడం లేదన్నారు. తక్షణమే పిఆర్‌సి కమిషన్ నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగులో ఉన్న 4 డిఎలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రణభేరి జాతాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధ్యక్షులు జి.నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.పెద్దిరాజు టిఎన్‌వి.సత్యబాబు, టిఆర్‌కె. గణపతి, ఆర్.శ్రీనివాసరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## వేతన బకాయిల కోసం కూలీల నిరసన

**ప్రజాశక్తి - సఖినేటిపల్లి**



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

2 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీలు, మేట్ల వేతనాలను చెల్లించాలంటూ కూలీలు నిరసన ప్రదర్శన చేశారు. సోమవారం సఖినేటిపల్లి లాకుల వద్ద వందలాదిమంది ఉపాధి కూలీలు మండల పరిషత్ కార్యాలయం వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. లాకుల వద్ద జరిగిన సమావేశంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్ పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచేందుకు ప్రయత్నిస్తుందని విమర్శంచారు. పోరాటంతో ఆ చట్టాన్ని పరిరక్షించుకోవాలని కూలీలకు ఆయన పిలుపునిచ్చారు. పని చేసిన 15 రోజులకు వేతనాలు చెల్లించాలని ఉపాధి చట్టం చెబుతుందని, అయితే గత రెండు నెలల నుంచి వేతనాలు అందకపోవడం దారుణమన్నారు పనికి ఉన్న డిమాండ్‌ను బట్టి బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నారు. ఉపాధి మేట్లు అనేక సేవలు అందిస్తున్నారని, వారికి ఏ విధమైన సహాయ సహకారాలు అందడం లేదని దళిత బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కుంకి రాజామణి అన్నారు. ఉపాధి పనులు తక్షణమే ప్రారంభించాలని, కచ్చితంగా ప్రతి కుటుంబానికి వందరోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎపిఒ నాగప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల శ్రీనివాసరావు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూసి జాన్‌మోసే, ఉపాధి కూలీ సంఘం మండల అధ్యక్షుడు దొండపాటి ప్రభాకర్, మేట్ల సంఘం అధ్యక్షురాలు చుట్టూరి నిర్మలాకుమారి, ప్రధాన కార్యదర్శి చింత హేమలత, సిపిఎం నాయకులు చెవ్వాకుల సూర్యప్రకాశరావు, లంకె తాతరాజు, గేదెల రాజశేఖర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


## 'టిడిపి అధ్యక్ష పదవిని ఎస్‌సిలకు కేటాయించాలి'

**ప్రజాశక్తి - అయినవిల్లి**

టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని ఎస్‌సిలకు కేటాయించాలని మండల టిడిపి నాయకులు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సర్పంచ్ కాకర బాబ్జి నివాసం వద్ద ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన పలువురు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఎంసి డైరెక్టర్ మోర్త సత్తిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన 27 దళిత పథకాలను పునరుద్ధరించిన సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపిని గ్రామ స్థాయిలో విస్తరించేదుకు కృషి చేస్తామని అన్నారు. జిల్లాలో అధిక సంఖ్యలో ఎస్‌సి సామాజికవర్గం ఉందని, కావున టిడిపి జిల్లా అధ్యక్ష స్థానాన్ని ఎస్‌సిలకు కేటాయించాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలోనూ మెజార్టీ స్థానాలను కైవశం చేసుకునేందుకు ఈ నిర్ణయం ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి మోర్త వెంకటేశ్వరరావు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కర్ జోగేష్, నాయకులు గుమ్మల్ల సాగర్, సరెళ్ళ సత్య నారాయణ, కుమ్మరి రమణ, కుసుమ బహుగుణ, పినిపే ప్రభుదాస్ పాల్గొన్నారు.

## పని భారం తగ్గించేలా చర్యలు

**ప్రజాశక్తి - రామచంద్రపురం**



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

పని వత్తిడితో సతమతమవుతున్న వార్డు సచివాలయ సెక్రటరీలపై పని భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సెక్రటరీలు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ మనమిత్ర వాట్సాప్ సేవ కోసం ఇంటింటికి వెళ్లి గతంలో వాలంటీర్లు క్లస్టర్లలో మ్యాపింగ్ చేసి క్యాంపెయిన్ చేసేవారని తెలిపారు. ఆ విధంగా తమను చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం దారుణమన్నారు. తమపై పని ఒత్తిడిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మద్దాల బాపూజీ, సంఘ నాయకులు రాయుడు శివరామకృష్ణ, విత్తనాల హరికృష్ణ, సాపిరెడ్డి శ్రీనివాస్, దుర్గాప్రసాద్, .నాగేశ్వరరావు, సత్యవేణి, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

**ప్రజాశక్తి - సఖినేటిపల్లి**



సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ దేవ

మండలంలోని గుడిమూల గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్‌ను ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. రూ.4 కోట్లతో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంతో గుడిమూల, రామేశ్వరం గ్రామాలకు విద్యుత్ సమస్యలు తొలిగనున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, ఎస్‌ఇ రాజేశ్వరి, ఎఇ ప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెద్దకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, పినిశెట్టి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును నిర్మించుకున్న రైతులు

**ప్రజాశక్తి - ఆత్రేయపురం**



రైతులు వేసుకున్న గ్రావెల్ రోడ్డు

అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో రైతులే స్వచ్చంధంగా ముందుకొచ్చి రోడ్డును నిర్మించుకున్నారు. ఆత్రేయపురం బుల్లిపేట నుంచి వాడపల్లికి వెళ్లే రహదారిలో ఏడేళ్ల క్రితం సిసి రోడ్డును ప్రభుత్వం నిర్మించింది. అక్కడి నుంచి లొల్ల రజకపేట నుంచి స్మశాన వాటికకు వెళ్లే కాలువ గట్టు సుమారు 600 మీటర్లు పైబడి మట్టి రోడ్డు ఉంది. ఆ రోడ్డు కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో రైతులు సుమారు రూ. 2 లక్షలను స్వచ్ఛంధంగా సేకరించి రోడ్డును వేసుకుని అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు.

## ఘనంగా అన్నదాన వార్షికోత్సవం

**ప్రజాశక్తి - కొత్తపేట**



భోజనాలు వడ్డిస్తున్న ఎంఎల్‌ఎ బండారు

పలివెలలోని ఉమా కొప్పులింగేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. తొలుత స్వామి వారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

## జనార్ధన స్వామి ఆలయంలో ఎసి తనిఖీలు

**ప్రజాశక్తి - ఆలమూరు**



ఆభరణాలను తనిఖీలు చేస్తున్న సిబ్బంది

స్థానిక జనార్ధన స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, వెండి బంగారు ఆభరణాల తనిఖీదారు విళ్ళ పల్లంరాజు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి స్వామివారి ఆభరణాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఆభరణాలన్నీ నూటికి నూరు శాతం క్వాలిటీ, క్వాంటిటీలో లెక్కలకు సరిపడా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు చిన్నం సుబ్బలక్ష్మి, అయినవిల్లి శ్రీనివాస్, ఇఒ నరేంద్రకుమార్, అర్చకులు పాల్గొన్నారు.

## జెడ్‌పి పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు


**ప్రజాశక్తి - కపిలేశ్వరపురం**



అవార్డును తీసుకుంటున్న హెచ్‌ఎం

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డును సాధించిందని పాఠశాల హెచ్‌ఎం వంగా శ్రీనివాస్ తెలిపారు. గురుపూజోత్సవం సందర్భంగా అమలాపురంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్, డిఇఒ సలీం బాషా చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. గత మూడు సంవత్సరాలుగా 5,2,4 స్థానాలు సాధిస్తూ జిల్లాలో ఉత్తమ పాఠశాలగా అవార్డు సాధించిందని తెలిపారు.

### కార్టూన్ 'నిజం'




## రైతులకు యూరియా పంపిణీ

**ప్రజాశక్తి - యంత్రాంగం**

**కపిలేశ్వరపురం** మండలంలోని కాలేరు, నల్లూరు, వెదురుమూడి గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జి.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి బి.రవి మాట్లాడుతూ నానో ఎరువులు వినియోగించడం ద్వారా రైతులు అధిక లాభాల పొందవచ్చని అన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల రైతులు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండలంలోని భీమనపల్లి సొసైటీ వద్ద రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఆకేటి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి జి.కుమార్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉపాధ్యక్షుడు కోలపల్లి గోవిందరాజులు, రైతులు కోలపల్లి పుల్లయ్య, ఆకేటి రామకృష్ణ, సొసైటీ సిఇఒ పోలిశెట్టి దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. **మామిడికుదురు** మండల పరిధిలో మూడు చోట్ల 50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి ఎన్‌వివి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు మామిడికుదురులో 20 మెట్రిక్ టన్నులు, ఈదరాడలో 20 మెట్రిక్ టన్నులు, మొగలికుదురులో పది మెట్రిక్ టన్నులు యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందన్నారు. అవసరమైన రైతులు యూరియాను తీసుకువెళ్లి సద్వినియోగం చేసుకోవాలన్నారు. **ఆత్రేయపురం** మండలంలోని వద్దిపర్రు ఆర్‌ఎస్‌కె వద్ద యూరియా లభ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట వ్యవసాయ అధికారి రామారావు, తహశీల్దార్ టి.రాజేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి భార్గవ్ మహేష్ పాల్గొని మాట్లాడారు. ఆత్రేయపురం, అంకంపాలెం సొసైటీలలో 60 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. **కొత్తపేట** స్థానిక సచివాలయంలో యూరియా కొరతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ప్రత్యేకాధికారి, తహశీల్దార్ వై.రాంబాబు, సర్పంచ్ బూసి జయలక్ష్మి పాల్గొన్నారు. మండలంలో యూరియా కొరత లేదని, రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కావద్దని అన్నారు.

## అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలి

**ప్రజాశక్తి - అమలాపురం**

అర్జీల పరిష్కారంలో నూటికి నూరు శాతం నాణ్యతతో పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్య పరిష్కారంలో స్పష్టత తప్పనిసరిగా ఉండాలన్నారు. అర్జీలు పునరావృతమైతే జిల్లా అధికారులు భాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. ప్రజలకు అత్యంత చేరువగా సుపరిపాలనను అందించాలని వివిధ స్థాయిలలో పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఆధిక ప్రాధాన్యతను ఇస్తుందని, ప్రజల నుంచి స్వీకరించిన ఆర్జీలకు పరిష్కారాన్ని చూపేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉంద న్నారు. ఆర్జీల పరిష్కారంలో స్పష్టత ఉన్నప్పుడే పరిష్కారం అవుతాయని, లేదంటే సమస్యలు పునరావృతమవుతూనే ఉంటాయని అన్నారు. ఆర్జీల పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన భాధ్యత జిల్లా అధికారులదేనని అన్నారు. పిజిఆర్‌ఎస్‌పై ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి మరింత బలం చేకూర్చేలా అధికారుల పనితీరు ఉండాలన్నారు. అర్జీలను నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అర్జీ స్వీకరించింది మొదలు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ అర్జీలు పరిష్కారంలో పారదర్శకత, నాణ్యత ఉండాలని, ప్రజా సమస్యలు పరిష్కారంపై అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. మొత్తం 200 అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఎస్‌డిసి పి.కృష్ణమూర్తి, డిఎల్‌డిఒ రాజేశ్వరరావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# యూరియా కొరత లేదు : కలెక్టర్

ప్రజాశక్తి - ఆలమూరు

జిల్లాలో యూరియా కొరత లేదని, కావాల్సినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని జొన్నాడలో అధికార యంత్రాంగంతో కలిసి కలెక్టర్ రైతు బాట పట్టారు. రైతులతో క్షేత్రస్థాయిలో వరి చేలను పరిశీలించి యూరియా స్థితిగతులపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 16 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని తెలిపారు. అయితే రైతుల డిమాండ్ మేరకు 21 వేల మెట్రిక్ టన్నుల యూరియాను ముందుగానే అందుబాటులో ఉంచామని చెప్పారు. ఇప్పటికే 20 వేల టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశామని, మరో వెయ్యి టన్నుల యూరియా నిల్వ ఉందని వివరించారు. అవసరం మేరకు మరో 3 వేల టన్నుల యూరియా రావాల్సివుందని తెలిపారు. యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతోందని, ఎలాంటి అపోహలు వద్దని రైతులకు వివరించారు. అయితే గత ఏడాది ఇదే సమయానికి 16 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందజేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. జొన్నాడ రైతులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో యూరియా కొరత లేదని కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని యూరియా దిగుమతి అవుతుందని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరు కూడా ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని కలెక్టర్ హామీ ఇచ్చారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా ఎకరాకు రెండు బస్తాల యూరియా సరిపోతుందనీ, అంతకు మించి వినియోగిస్తే పంట నష్టపోవడమే కాకుండా భూసారం కూడా దెబ్బతింటుందని కలెక్టర్ రైతులకు వివరించారు. యూరియా సరఫరాపై మండల అధికారులు, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బోసుబాబు, ఆర్‌డిఒ పి.శ్రీకర్, ఎడిఎ సిహెచ్‌కెవి.చౌదరి, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎఒ బి.మీనా, ఆర్ఐ రమాయమ్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని చిత్రాడలో ఆటో ఢీకొని ఒక మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి సోమవారం రాత్రి గ్రామానికి చెందిన ఎం శేషారత్నం(58) రోడ్డు దాటుతుండగా కాకినాడ నుంచి పిఠాపురం వైపు వస్తున్న ఆటో బలంగా ఢీకొనడంతో శేషారత్నం ఘటనా స్థలంలోనే స్పృహ కోల్పోయింది. దీంతో స్థానికులు హైవే అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాద సంఘటనపై పట్టణ ఎస్ఐ మణికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కేసుల్లో ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్తిపాడు సిఐ సూరి అప్పారావు తెలిపారు. గోకవరం గ్రామానికి చెందిన తొండ శాంతి, ఆవుల భూలక్ష్మి ఆర్‌టిసి బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికుల దృష్టి మళ్లించి బ్యాగులను తస్కరిస్తూ నగదు, బంగారు వస్తువులను అపహరించేవారని తెలిపారు. వీరిద్దరూ ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రౌతులపూడి, అన్నవరం స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్టు తెలిపారు. వారి నుంచి రూ.2 లక్షల నగదు, 106 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అన్నవరం ఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని గరప్పాడు గ్రామానికి చెందిన సూరగాని రమ్యశ్రీ (19) అదృశ్యమైందని ఆమె తల్లి సూరగాని సాయిలక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన తమ కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరలదేని తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట మారుతి సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన అప్పారి సత్యనారాయణ వ్యక్తిగత పనిపై ద్విచక్రవాహనంపై కొత్తపేట వచ్చాడు. కొత్తపేట నుంచి రావులపాలెం వెళ్తుండగా కొత్తపేట మారుతీ సెంటర్‌లో వెనక నుంచి వచ్చిన లారీ సత్యనారాయణను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతని కాలుకు తీవ్రగాయం అయింది. ఇదే తరుణంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు కొత్తపేట నుంచి పలివెల వెళ్తూ ప్రమాద సంఘటనను చూసి ఆగారు. క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కొత్తపేట ప్రభుత్వాసుపత్రి వైద్యులను ఆదేశించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.సురేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నర్సిపూడి అభివృద్ధి కోసం వినతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని నర్సిపూడిలో పలు అభివృద్ధి పనులకు సహకరించాలని పిఎసిఎస్ అధ్యక్షుడు రాయుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ మధ్యలో ఉన్న చెరువులో లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఉన్నప్పటికీ ఆలయ దక్షిణ భాగం వైపు మహా శివలింగం, వారది నిర్మించుటకు అనుమతులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

## ఎంఎంసి ఛైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కల రేశ్వంత్‌రాయ్‌ను ఎపిఎస్ఐడిసి డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, అంబాజీపేట పిఎసిఎస్ ఛైర్మన్ అరిగెల సూరిబాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రిష్వంత్ రాయ్‌ను వారు సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు.

## అనంతకుమారిని కలిసిన యుటిఎఫ్

ప్రజాశక్తి - కొత్తపేట

బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన రెడ్డి అనంతకుమారిని యుటిఎఫ్ మండల శాఖ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

## రఘురామ్‌కు పలువురి సత్కారం

ప్రజాశక్తి - జగ్గంపేట

వైసిపి సీనియర్ నేత ఒమ్మి రఘురామ్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆయనను పార్టీ అధినేత వైఎస్ జగన్ రాష్ట్ర కార్యదర్శిగా, కాకినాడ రూరల్ పరిశీలకులుగా నియమించారు.

## సూపరింటెండెంట్‌గా రమేష్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వి.రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ శైలజ కడియం ఆసుపత్రికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీ ముఖద్వారంగా ఉన్న ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో 24 గంటలూ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది డాక్టర్ రమేష్‌కు ఘన స్వాగతం పలికారు.

## వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గొల్లప్రోలులో ఆదివారం సాయంత్రం కురిసిన భారీవర్షం, ఈదురు గాలులకు ఇంటి పైకప్పు పడి పోయింది. గొల్లప్రోలు పట్టణంలోని మార్కండేయపురానికి చెందిన రాపర్తి గనిరాజుకు చెందిన ఇంటి పైకప్పు కూలిపోయి సామాన్లు విరిగిపోయాయి.

# ఇఎస్ఐ పరిధిలోకి తీసుకురావడం అవసరం

ప్రజాశక్తి - రాజోలు

కేంద్ర ప్రభుత్వం నిబంధనను అనుసరించి ప్రతి ప్రయివేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇఎస్ఐ పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఇఎస్ఐ అధికారి కిషోర్‌కుమార్ అన్నారు. సోమవారం మలికిపురం మండలం విశ్వేశ్వరపురంలోని వివేకానంద హైస్కూల్లో రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, పి.గన్నవరం మండలాల ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యంతో ఇఎస్ఐ, కార్మిక శాఖ సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇఎస్ఐ పరిధిలోకి తీసుకొస్తే భవిష్యత్తులో ప్రభుత్వం ద్వారా లభించే రాయితీల్ని పొందవచ్చునని అన్నారు. ప్రయివేట్ పాఠశాల సిబ్బందికి అనారోగ్య సమస్యలు వస్తే కార్పొరేట్ స్థాయిలో వైద్య సదుపాయం పొందవచ్చుని అన్నారు. లేబర్ అధికారి మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి స్కూల్ వాహనానికి లేబర్ ఫైనాన్స్ లైసెన్స్ పొందాలన్నారు. వెహికల్ ఇన్సూరెన్స్‌తో పాటు ప్రతి స్కూల్ ప్రతి ఒక్కరూ లేబర్ లైసెన్స్ పొందాలన్నారు. ఈ సమావేశంలో ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, జిల్లా అధ్యక్షుడు రమణారావు, జిల్లా సెక్రెటరీ టిఎస్ఆర్.అయ్యప్పనాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పివి.వరప్రసాద్, డివిజనల్ అధ్యక్షులు రత్నరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి ఒక దాత రూ.25,116 విరాళాన్ని అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్రం నల్లగొండకు చెందిన దాత గోల్కొండ మనోజ్‌రామ్‌ఫణింద్ర, శేషలలితరమ్య దంపతులు ఈ విరాళాన్ని అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన దాత సింహాద్రి వెంకట విజయ హనుమా, సూర్యకళ దంపతులు రూ.25,116 విరాళాఇన్న ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్‌రావుకు అందజేశారు. దాతలకు స్వామి వారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు, చిత్రపటంను అందజేవారు.

## సిపిఐ నేత నిమ్మకాయల మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఆలమూరు

సిపిఐ నేత, మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక సమత కార్యాలయం వద్ద సిపిఐ, ప్రజానాట్య మండలి, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, సిపిఐ, ప్రజానాట్యమండలి సభ్యులు పాల్గొన్నారు.

## 10న హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - కొత్తపేట

మందపల్లి గ్రామంలోని మందేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని ఈ నెల 10వ తేదీన లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గ్రామస్తులు, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారుల సమక్షంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కిస్తామన్నారు.

# ఉపాధ్యాయులతోనే మెరుగైన సమాజం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మెరుగైన సమాజం ఉపాధ్యాయులతోనే సాధ్యమౌతుందని ఎంపిపి అంబటి భవాని అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో అజ్ఞానాన్ని పారద్రోలి విజ్ఞానాన్ని పంచేది ఉపాధ్యాయులేనని అన్నారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను, పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖామంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, ఎంఇఒలు వీర రాఘవరెడ్డి, నాగేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రామారావు, గరికపాటి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షులు వుండవిల్లి శివ, మేడిశెట్టి సూర్యనారాయణ, గౌరీ శంకర్, వాడ్రేవు సాయిప్రసాద్, విత్తనాల వెంకటరమణ, చందమామ వాసు, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నిర్వాహకులు

## 'జాతాను విజయవంతం చేయండి'

ప్రజాశక్తి - కొత్తపేట

ఉపాధ్యాయులపై పెరుగుతున్న వత్తిడిని తగ్గించాలని కోరుతూ జరుగుతన్న జాతాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వై.మురళీ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ మండల శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ఈ నెల 15 నుంచి 19 వరకు బైక్ జాతా జరుగుతుందన్నారు. ఈ జాతాలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు టి.విజయకృష్ణ, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెపిసిహెచ్.సూర్యారావు, జి.రాంకుమార్, సహధ్యక్షులు పి.భాస్కరశాస్త్రి, వై.జయావతి పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు



తాళం వేసివున్న గ్రంథాలయం

## గ్రంథాలయం తెరిచేదెప్పుడో..?

ప్రజాశక్తి - ఐ.పోలవరం

మండల కేంద్రంలో ఉన్న శాఖాగ్రంథాలయం తెరిచేదెప్పుడో తెలియక పాఠకులు ప్రతీ రోజు వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. ఈ ఏడాది జూన్‌లో సంబంధిత గ్రంథాలయం లైబ్రేరియన్ అంబటి వెంకట నారాయణ కాకినాడకు బదిలీ అయ్యారు. ఆయనే ఈ గ్రంథాలయానికి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే ఇన్‌ఛార్జ్ హోదాలో ప్రతీ ఆదివారం ఆయన గ్రంథాలయానికి వచ్చి తలుపులు తీస్తున్నారు. మిగిలిన రోజుల్లో గ్రంథాలయాన్ని తెరిచే నాథుడు లేకుండా పోయాడు. ఈ గ్రంథాలయంలో సుమారు 500లకు పైగా పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు, ప్రతీరోజు గ్రంథాలయానికి వచ్చే న్యూస్‌పేపర్‌లను స్వీపర్ భద్రపరిచి, గ్రంథాలయాన్ని శుభ్రం చేసి తాళాలు వేసుకుని వెళ్లిపోతున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో గ్రంథాలయం మూసి ఉండటంతో పాఠకులు వచ్చి నిరుత్సాహంతో తిరిగి వెళుతున్నారు. పాఠకులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించి, ప్రతీ రోజు గ్రంథాలయాన్ని తెరిగేలా చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

## ఆర్‌పిఐ కార్యకర్త 'పంతగడ' మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అనారోగ్యంతో బాధపడుతూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యకర్త పంతగడ లక్ష్మీనరసింహారావు ఆదివారం మృతి చెందారు. మండలంలోని ఠానేలంక చినపేట గ్రామానికి చెందిన ఆయన గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. విద్యార్థి దశ నుంచి రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్(ఆర్‌ఎస్‌ఎఫ్)లో పని చేశారు. మాజీ ఎంఎల్‌ఎ బివి.రమణయ్య అనుచరుడిగా అనేక విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆయన స్వగృహం వద్ద మతుని చిత్రపటానికి భార్య లావణ్య, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి విజయశ్రీ

## విద్యతోనే మహిళల అభివృద్ధి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మహిళలంతా విద్యావంతులైనపుడే సమాజాభివృద్ధి సాధ్యమని ఐసిడిఎస్ అధికారి వై.విజయశ్రీ అన్నారు. సోమవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సిడిపిఒ ఎం.నిహారిక అధ్యక్షతన మిషన్ శక్తి (సంకల్ప్)పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మహిళల కోసం ప్రభుత్వం చేపడుతున్న సౌకర్యాలతోపాటు, సైబర్ నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు చేస్తున్న చర్యలను వివరించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో మహిళలు ముఖ్య భూమిక పోషించాలని, 18 ఏళ్ళ లోపు బాలికలపై జరిగే లైంగిక వేధింపులను రూపుమాపేందుకు పోక్సో చట్టం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, లీగల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అన్నదాత పోరుకు తరలిరండి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద మంగళవారం జరుగుతున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి నాయకుడు కుంచె రమణారావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పంటలకు యూరియా కావాలని రైతులు అడిగితే వారిపై కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రైతులకు రాయితీపై సరఫరా చేయవలసిన యూరియాను టిడిపికి చెందిన వ్యాపారులకు ఆధార్ కార్డు ద్వారా చేరవేస్తున్నారని ఆరోపించారు. ఆధార్ కార్డు ద్వారా పొందిన యూరియాను బస్తాకు రూ.200 చొప్పున అదనంగా బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటున్నారని విమర్శంచారు.


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

## అవార్డు గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మండలంలోని భీమనపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు కోడూరి ధర్మారావు దంపతులను, యార్లగడ్డ భాస్కర శాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల హెచ్ఎం నూకల సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు సలాది దొరైనాయుడు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, ఎస్ఎంసి ఛైర్మన్ గుర్లింక చిన్న, పీడీ కామన మధుసూదనరావు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఇమామ్‌లు, మౌజాన్లు

## గౌరవ వేతనాల కోసం ఇమామ్‌ల ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో గత 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనాలను చెల్లించాలంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. సోమవారం జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌ఖాదర్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజోలు, అమలాపురం, పి.గన్నవరం, ముమ్మిడివరం, కొత్తపేట మైనారి సెల్ అధ్యక్షులు ఎండివై.షరీఫ్, కాజబాబు, అన్వార్ తాహిర్, మీర్జా ఆదామ్, ఖాజా బాబు, మహమ్మద్ జుబేర్, నౌషాద్, యూసుఫ్, కర్రర్ హుషేన్ పాల్గొన్నారు.



## యానాం వార్తలు

### సిఎస్ఆర్ నిధులు సక్రమంగా వినియోగించాలి

ప్రజాశక్తి-యానాం

ప్రాంతీయ పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టిన అంకిత్ కుమార్‌ను రిటైర్డ్ అండర్ సెక్రెటరీ గిడ్డి బలరామ్, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పండు సిద్ధార్థ కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. దీనిలో ముఖ్యంగా సిఎస్ఆర్ నిధులు యానాం అభివృద్ధికి సక్రమంగా ఉపయోగించాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని అందించారు.



ఫిజియోథెరపీ డేలో పాల్గొన్న ఆర్ఎఒ అంకిత్ కుమార్

### ఘనంగా వరల్డ్ ఫిజియోథెరపీ డే

ప్రజాశక్తి - యానాం

భారత సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సహకారంతో డైరెక్టర్ బివి రామ్ కుమార్ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్, ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ అధ్యక్షతన స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో వరల్డ్ ఫిజియోథెరపీ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ అంకిత్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఫిజియోథెరపీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యెతేంద్ర కుమార్, ఎస్‌పి.రెడ్డి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ రిఫ్కా రోషియో, శ్రీకాంత్, ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### పైప్‌లైన్ లీకేజీ ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - యానాం

కొన్ని రోజుల క్రితం దరియాలతిప్ప ఐలాండ్ నెంబర్ 3 సమీపంలో ఓఎన్‌జిసికి సంబంధించిన గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ ప్రాంతాన్ని ఆర్ఎఒ అంకిత్ కుమార్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రజల ఫిర్యాదు మేరకు దరియాలతిప్ప వాటర్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిటి జ్యోతి వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ అధికారి డి.గొంతయ్య, పిడబ్ల్యుడి ఇఇ కాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.